www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 20 మే 2025

5

కోనసీమ

గ్యాస్ నిక్షేపాల కోసం పరిశోధనలు

ప్రజాశక్తి - మామిడికుదురు

ఓఎన్‌జిసి గ్యాస్ నిక్షేపాల కోసం ఈ-2000-3 రిగ్గుతో పాశర్లపూడి లంకలో డ్రిల్లింగ్ పనులు చేపట్టింది. వైనతేయ గోదావరి నది అంతర్భాగంలో డివి ఎస్‌ఎస్ ప్రక్రియ ద్వారా డ్రిల్లింగ్ చేస్తున్నారు. 2910 మీటర్ల లక్ష్యం మేర డ్రిల్లింగ్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఉన్న రెండు బావుల నుంచి గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. మరో బావి నిరుపయోగంగా ఉంది.అదే సైట్‌లో నాలుగవ బావిలో ప్రస్తుతం డ్రిల్లింగ్ చేస్తున్నారు.

పాశర్లపూడిలంకలో డ్రిల్లింగ్ చేస్తున్న ఓఎన్‌జిసి రిగ్

సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తాం

-పుచ్చలపల్లి వర్ధంతి సభల్లో వక్తలు

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకులు పుచ్చలపల్లి సుందరయ్యకు సిపిఎం, ఇతర ప్రజా సంఘాల నేతలు ఘనంగా నివాళులర్పించారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లాలోని పలు ప్రాంతాల్లో సిపిఎం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అమలాపురంలో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్‌సి ఐవి, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమలాపురం

నిరాడంబరుడు, తన జీవితాన్ని పేద ప్రజల కోసం అంకితం చేసిన యోధుడు సుందరయ్య అని మాజీ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సుందరయ్య తన భూమిని పేదలకు పంచిన మానవతావాది అని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని పిలుపునిచ్చారు. 20 ఏళ్ల పాటు పార్లమెంట్, అసెంబ్లీలో నిరంతరం ప్రజల సమస్యలపై గళమెత్తారని అన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని, వాటికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసే ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపించారు. అనేక సంవత్సరాల నుంచి పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసేందుకు సహకరించిన విశ్రాంత ఉపాధ్యాయులు కంభంపాటి సూర్యనారాయణ, యుటిఎఫ్ అమలాపురం పట్టణ కమిటీకి ఐవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.నాగవరలక్ష్మి, కె.శంకర్, జి.దైవకృప, పి.అమూల్య, ప్రజాసంఘాల నాయకులు శివచంద్రశేఖర, అమీదా, ఎన్.విదిష, ఎం.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి విత్తనాల రాంబాబు, విప్పర్తి మోహన్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్లంకుర్రు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు మజ్జిగ చలివేంద్రాన్ని యూనియన్ అధ్యక్షులు గంజా సత్తిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య అందరికీ సుపరిచితులేనని, విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమంలోకి ప్రవేశించారని అన్నారు. గాంధీజీ స్ఫూర్తితో సత్యాగ్రహంలో సుందరయ్య పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ రాజు, జేమ్స్ పాల్, రాయపురెడ్డి కృష్ణ, జె.మంగాదేవి, బి.దివ్యభారతి, జె.చిన్నబాబు, పులుగు అర్జున్‌రావు, సుకుపల్ల ప్రసాద్ పాల్గొన్నారు. **ముమ్మిడివరం** స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు పాము బాలయ్య ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్ర పటానికి మండల పార్టీ కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, సూర్యనారాయణ మాట్లాడుతూ సుందరయ్య జీవితాంతం ప్రజా పోరాటాలకు అంకితం చేసిన యోధుడన్నారు. నేడు కేంద్ర, రాష్ట్రాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాటం చేయడమే సుందరయ్యకు మనమిచ్చే నివాళులన్నారు. లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో పాము బాలయ్య, దొమ్మేటి వీర రాఘవులు, అనుసూరి లక్ష్మణరావు, కెవిపిఎస్ నాయకులు నిమ్మకాయల వెంకటేష్, యలమంచిలి బాలరాజు, కాకి రాంబాబు, సత్యనారాయణ, వెంకట లక్ష్మి, మహమ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు. **రాజోలు** సఖినేటి పల్లి మండలం కెవి.పాడులో సిపిఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ సుందరయ్య తన సొంత గ్రామంలో కుల వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పీతల రామచంద్రరావు, మలికిపురం శాఖ కార్యదర్శి సిహెచ్ సూర్యప్రకాశ రావు, ముత్యాలపల్లి శంకరం పాల్గొన్నారు. **మండపేట** పట్టణంలో సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి కె.కృష్ణ వేణి పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు, కార్మికుల, కష్టజీవుల గొంతు పార్లమెంట్లో వినిపించిన మహోన్నతుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. పార్లమెంట్‌కి సైకిల్ మీద వెళ్లారని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.నరేంద్రకుమార్, బి.కొండ, సిహెచ్.రాణి, ఎం.సూర్యకుమారి, బి.రాజు, కె.మణికంఠ, దయానందరావు, 108 ఉద్యోగుల సంఘం నాయకులు రాజు, తదితరులు, పాల్గొన్నారు.

మండపేటలో నివాళులర్పిస్తున్న సిఐటియు జిల్లా కోశాధికారి కృష్ణవేణి

అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - అమలాపురం

పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్‌ఒ రాజకుమారి, డ్వామా పీడీ మధుసూదన్, సర్వ శిక్ష అభియాన్ ఎపిసి జి.మమ్మీ, ఎస్‌డిసి కృష్ణమూర్తితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై సుమారుగా 225 అర్జీలు పిజిఆర్‌ఎస్‌లో వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో జవాబుదారీ తనం తప్పనిసరిగా ఉండాలన్నారు. పిజిఆర్‌ఎస్‌లో విభిన్న అర్జీలు ఇవ్వడం జరుగు తోందని, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. పిజిఆర్‌ఎస్‌కు వస్తున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, అంతే ప్రాధాన్యతను అధికారులు ఆయా సమస్యల పరిష్కారానికి ఇవ్వాలని అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు అర్థం చేసుకుని చక్కని పరిష్కారాన్ని చూపించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు ఉంటే అర్జీదారునికి ఏ కారణం చేత సమస్యను పరిష్కారం చేయలేక పోతున్నామో అర్థమయ్యేలా వివరించాలన్నారు. పిజిఆర్‌ఎస్ అర్జీలు పునరావృతం అయితే సంబంధిత అధికారులే పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో కలెక్టర్, ఇతర అధికారులు స్వయంగా మాట్లాడి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జిఒ నెంబర్-4ను ఉపసంహరించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్-4ను ఉపసంహరించుకోవాలని విఆర్ఒ సంఘం నేతలు కోరారు. సోమవారం విఆర్ఒల సంఘం నాయకులు తహాశీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిఒ నెంబర్ 4 వల్ల 7200 మంది విఆర్ఒలు మిగులు సిబ్బందిగా ఉండాల్సి వస్తుందన్నారు. రెండు గ్రామాలకు ఒక విఆర్ఒను నియమించడం వల్ల విఆర్ఒలపై ఒత్తిడి పెరిగిపోయి అనారోగ్య సమస్యలకు గురియ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గౌరవ అధ్యక్షులు మద్దాల బాపూజీ, మండల అధ్యక్షులు పి..సత్తిబాబు, సెక్రటరీ . నరేష్, ఉపాధ్యక్షులు పి.సాయిప్రతిమ, కోశాధికారి సురేష్, మాజీ అధ్యక్షులు పంపన విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న విఆర్ఒల సంఘం నేతలు

ఉప్పునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

పంట పొలాలను నాశనం చేస్తున్న ఉప్పునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో రైతులు ఉప్పు నీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ ఆయకట్టుకు సంబంధించిన కుమ్మరి కాలువకు ఉన్న లాకులు మరమ్మతులకు గురికావడంతో ఖరీఫ్, రబీ సమయంలో వరిచేలను ఉప్పు నీరు తాకుతుందన్నారు. సుమారు 100 ఎకరాల వరిచేలు ఉప్పు నీరు ముంపుతో నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కుమ్మరి కాలువ లాకులకు తక్షణమే మరమ్మతులు చేయించాలని, కుమ్మరి కాలవ, మేక కాలువ వంతేన నుంచి గంట వారి తూము వరకు మురుగు కాలువలోని గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు, పేరూరు పంచాయతీ వార్డు సభ్యులు డేగల వెంకటరమణ, దూనబోయిన గణేశ్వరరావు, జల్లి శ్రీను, రైతులు వెంకటరమణ, నరేంద్ర సత్యనారాయణ, దూనబోయిన ఫణేంద్ర, అడప బంగారయ్య, జల్లి సత్యం, జల్లి నాగేశ్వరరావు, కడలి వెంకటరావు, చింతపల్లి బేతాళ స్వామి, ముత్తబత్తుల రాజు పాల్గొన్నారు. .

కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న రైతులు

రోడ్లు, డ్రెయిన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

రాయవరం మండలం చెల్లూరు గ్రామంలో రోడ్లు, డ్రెయిన్లు పనులను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా యర్రమట్టిపురం, కృష్ణమ్మ చెరువు, ఆంజనేయ నగర్, తూర్పుపేట, తన్నేడివారి వీధిలలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. గ్రామ ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ చట్టం నిధులతో అత్యవసరమైన చోట్ల రోడ్లు, డ్రెయిన్లు వెంటనే నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నూని ఏసు బాబు, చెల్లూరు గ్రామశాఖ అధ్యక్షులు చంద్రు రాజు, మోరంపూడి రాజ్‌కుమార్, దేవు శ్రీను, దంగేటి సత్యనారాయణ, కురుపూడి రాజు, పసల విద్యాధర్, మురకొండ విజయదుర్గారావు, అధికారులు పాల్గొన్నారు.



వివరాలను తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

ఎస్‌సిలు అధికంగా ఉండే గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్‌సిలు 50 శాతం పైబడి ఉన్న గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంపిడిఒలతో ఆన్‌లైన్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. పిఎం ఆదర్శ గ్రామ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. షెడ్యూ ల్డ్ కులాల జనాభా 50 శాతం ఎక్కువ కంటే ఉన్న గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే ఈ పథకం లక్ష్యమని అన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజల కనీస అవసరాలు పూర్తిగా తీర్చేందుకు ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. సంస్థాగత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటుగా సామాజిక ఆర్థిక అసమానతలను తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేయడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. భారత్ నిర్మాణ్, పిఎం గ్రామ్ సడక్ యోజన, సర్వ శిక్షా అభియాన్, గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి పథకాలను ఈ గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేస్తారన్నారు షెడ్యూల్డ్ కులాల జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను కోనసీమ జిల్లాలో 55 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 34 గ్రామాల కార్యాచరణ ప్రణాళికలు ఎంపిడిఒలు సమర్పించారని, మిగిలిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్, గృహ నిర్మాణం వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలన్నారు. సామాజిక భద్రత, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక చేరిక డిజిటలైజేషన్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, సామాజిక సమానత్వాన్ని సాధించడానికి ఈ పథకం ఉపకరిస్తుందని ఆయన వివరించారు.

రైతులకు పవర్ టిల్లర్ల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

రాయవరం మండలం వెంటూరు గ్రామంలో మండలానికి చెందిన పలువురు రైతులకు 23 పవర్ టిల్లర్స్‌ను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పాలన సాగిస్తుందన్నారు. యూనిట్ విలువ రూ.52.78 లక్షలకు గాను ప్రభుత్వం రూ.23 లక్షలు రాయితీ ఇస్తుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం వెంటూరు గ్రామంలో ఉపాధి హామీ చట్టం నిధులు రూ.9.80 లక్షలతో దుర్గాదేవి గుడి వెనుక నిర్మించిన సిసి రోడ్డు కం డ్రెయిన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాల దొర, మండల టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి మాధారావు, గ్రామ అధ్యక్షులు దేవళ్ళ వెంకట్రావు, నాయకులు చిరట్ల అప్పారావు, గొడితి సత్యం, తహాశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ స్పందన, వ్యవసాయ శాఖ ఎఒ ప్రభాకర్, పంచాయితీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతనంగా నిర్మించిన రోడ్డు, డ్రెయిన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

కార్టూ'నిజం'

ఆదాయం కోసం అధ్యయనం
_సిఎం ఆదేశం

100 పడకల ఆస్పత్రిగా ఆధునికీకరించాలి

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేటలో ఉన్న పిహెచ్‌సిని వంద పడకల ఆసుపత్రిగా ఆధునీకరించి, సౌకర్యాలను కల్పించాలని కొత్తపేట నియోజకవర్గ టిడిపి మహానాడు తీర్మాణించింది. సోమవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 56,789 సభ్యత్వాలు నమోదయ్యాయని, నియోజకవర్గంలో 262 పోలింగ్ బూత్‌లు గాను 8,396 మంది కుటుంబ సంక్షేమ సారథులుగా నియమితులయ్యారని తెలిపారు. 262 బూత్‌లకు కన్వీనర్లు, 262 మంది బూత్ కో కన్వీనర్లు నియమితులయ్యారని, నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి 51 యూనిట్‌లకు 51 మంది యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, 51 మంది కో ఇన్‌ఛార్జ్‌లు నియమించినట్లు వివరించారు. 57 గ్రామాలకు పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి నియమించుకోవడంతోపాటు, కార్యవర్గాలను ఎంపిక చేసుకున్నామని తెలిపారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తపేట ప్రభుత్వాసుపత్రి 100 పడగల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని, ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకలు ఆసుపత్రిగా మార్చాలని, వెదిరేశ్వరం నుంచి పలివెల వరకు నేషనల్ హైవేలో భాగంగా నిర్మాణంలో ఉన్న కాలువ గట్టు రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని, గత ప్రభుత్వ పాలనలో నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, కెవి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బండారు

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు

గ్రేడ్ 2 పంచాయతీగా పరిగణించేలా చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని హసన్‌బాధ గ్రామాన్ని గ్రేడ్ 2 పంచాయితీగా పరిగణించాలని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు కోరారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సర్పంచ్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పునర్విభజనలో హసన్ భాద గ్రామాన్ని గ్రేడ్-2 పంచాయతీలో జనాభా ప్రాతిపదికన అప్‌గ్రేడ్‌కు కేవలం 13 మంది తక్కువగా ఉందని, 2011 జనాభా లెక్కల ప్రకారం తక్కువ ఉందని ప్రస్తుతం లెక్కల ప్రకారం 2000పైగా జనాభా ఉందని వివరించారు. తమ పంచాయతీని గ్రేడ్ 2 పంచాయతీగా పరిగణించాలని, దీనిపై ఇటీవల కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసిన విషయాన్ని తెలిపారు. పంచాయతీలో నిర్వహించే కార్యక్రమాలు, గ్రామ సమస్యలపై సర్పంచ్ చర్చించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ ఈ విషయాన్ని తెలియజేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో రూ.50 లక్షల అంచనా విలువతో నిర్మించనున్న అన్న క్యాంటీన్‌కు ఎంఎల్‌ఎ బండారు సత్యానంద రావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వం భోజనం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, ధర్నాల రామకృష్ణ, ముత్యాల బాబ్జి, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంఎల్‌ఎ బండారు

బుర్రకథ ద్వారా ఎయిడ్‌పై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుర్రకథ కళాకారులు సోమవారం రామచంద్రపురం మండలంలోని తోటపేటలో వీధి నాటకం ప్రదర్శించారు. కళాజాతాలతో ప్రజలను చైతన్యం చేసేందుకు వీధి నాటకాలు ఎంతో ఉపయోగపడతాయని బుర్రకథ కళాకారుడు వేమవరపు రాంబాబు తెలిపారు. వీధి నాటకంలో హెచ్ఐవి వ్యాధి ఎలా వ్యాపిస్తుంది? ఎయిడ్స్ కంట్రోల్‌కు తీసుకోవలసిన జాగ్రత్తలు, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంగాజి, కార్యదర్శి మణికంఠ, ఎఎన్ఎం సుబ్బలక్ష్మి, ఆశ వర్కర్ సుభాషిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెంకన్నకు బంగారు పంచ పాత్రలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామికి సోమవారం కొత్తపేటకు చెందిన మంతెన వెంకట సూర్యసుబ్బరాజు, కుటుంబ సభ్యులు 209 గ్రాముల ఐదు బంగారు పంచపాత్రలు, 318 గ్రాముల వెండి కంచం ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరరావుకు అందజేశారు. వీరికి ముందుగా ఆలయ అధికారులు అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగర 33/11 కె.వి సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ కె.రత్నాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర మట్టలు, శ్రీరామపురం, వెదురుమూడి, పడమరఖండ్రిక, కాలేరు, సుభద్రాపురం, నల్లూరు, నేలటూరు, వల్లూరు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముఖ ద్వారానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రావులపాలెం నుంచి బొబ్బర్లంక వెళ్లే రోడ్డులో సోమవారం వాడపల్లి వేంకటేశ్వర స్వామి ముఖ ద్వారం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. దాతలు సిఎంఆర్ షాపింగ్ మాల్స్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు, ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు శంకుస్థాపన చేశారు

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఏలూరుకు చెందిన రంబా చంద్రశేఖర్, రమ్య దంపతులు సోమవారం రూ.10,116 విరాళాన్ని అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం అందజేసి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో యువకుడు మృతి

ప్రజాశక్తి- కొవ్వూరు

సీతంపేట సమీపంలో విజ్జేశ్వరం ఆనకట్ట తొమ్మిదో గేటు వద్ద గోదావరిలో స్నానానికి దిగ్గి నిడదవోలుకు చెందిన గాడి రాకేష్(17) ప్రమాదవశాత్తూ మునిగిపోవడంతో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ కె.శ్రీహరిరావు తెలిపిన వివరాల మేరకు కిరణ్‌కుమార్‌తో కలిసి రాకేష్ గోదావరి బ్యారేజీకి వెళ్లాడు. కొద్దిసేపు స్నానాలు చేసి ఫోటోలు దిగారు. ఆకస్మికంగా రాకేష్ నీటిలో మునిగి గల్లంతయ్యారు. దీంతో స్థానికులు రాకేష్‌ను వెలికి తీశారు. కొన ఊపిరితో ఉన్న అతన్ని నిడదవోలు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మతుని చిన్నాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని వాడపాలెం గ్రామానికి చెందిన గంధం నాగేశ్వరరావు(37) ఆదివారం రాత్రి కొత్తపేటలో శివాలయంలో బంధువుల వివాహం నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా బస్టాండ్ వద్ద అమలాపురం నుంచి రావులపాలెం వైపు వెళుతున్న ఆర్‌టిసి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని నంగవరంలో ఆదివారం అర్ధరాత్రి రైతు శీలం సత్యనారాయణకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. సుమారు 6 ఎకరాల గడ్డివాముకు అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని రైతు సత్యనారాయణ సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. మంటలను ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది సుమారు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

భర్తపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి అనురాధకు అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంతో 17 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు అమ్మాయిలు జన్మించారు. ఇటీవల కాలంలో సుబ్రమణ్యం భార్య అనురాధను పుట్టింటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ రోజు మానసికంగా, శారీరకంగా వేధించడంతోపాటు అనురాధను ఇంటి నుండి బయటకు నెట్టేశాడు. సహనం కోల్పోయిన ఆమె సోమవారం స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రామ తెలిపారు.

బైకు చోరీ

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఉప్పాడలో పాత్రికేయుని బైకు సోమవారం తెల్లవారుజామున చోరీకి గురైంది. ఉప్పాడలో ఆదివారం రాత్రి తోట శాంతి బైకు పార్క్ చేసిన వివాహ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వచ్చి చూడగా బైకు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

వ్యభిచార గృహం గుట్టు రట్టు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో వ్యభిచార గృహం గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముందస్తు సమాచారంతో సోమవారం ఉదయం సుమారు 11 గంటలకు గ్రామంలోని మారుతీ నగర్‌లోని ఒక ఇంట్లో సిఐ నాగేశ్వరనాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. నిర్వాహకులను, ఇద్దరు మహిళలు, ఒక విటుడును అరెస్టు చేశారు. గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన జుట్టా బేబి, దుద్దుకూరు గ్రామానికి చెందిన సిర్రా రవి కలిసి మారుతీ నగర్‌లో ఒక ఇల్లు అద్దెకు తీసుకొన్నారు. మహిళలకు వల వేసి వారిని ఆ ఇంటికి రప్పించి వ్యభిచారం చేయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారని సిఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని బాధిత మహిళలను ఎపి స్టేట్ హోమ్‌కు తరలిస్తామన్నారు.

పేదలకు ఆహారం వడ్డిస్తున్న నవీన్

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. జగ్గంపేట గ్రామానికి చెందిన కొయ్యన రోహిత్ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ అన్న క్యాంటీన్‌ను టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించి పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు బద్ది సురేష్, దాపర్తి సీతారామయ్య, దేగల సత్యనారాయణ, మరిశెట్టి గంగ, ఎండి కాజా, కొయ్యన అప్పయమ్మ, కొయ్యన జయ సూర్యనారాయణ, అల్లు సతీష్, అల్లు స్వర్ణ దుర్గ, అల్లు హేత్రిక, ఈగల సత్యవతి పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో నాలుగు ఫిర్యాదులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సమస్యల పరిష్కారం కోరుతూ నాలుగు అర్జీలు అందాయని ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ మాధవరావు తెలిపారు. భూమికి సంబంధించిన సమస్యలపై 3, బోర్‌వెల్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చాయన్నారు. ఈ అర్జీలను సంబంధిత కార్యాలయాలకు పంపించి నిర్ణీత సమయంలో పరిష్కరించి అర్జీదారులకు తెలియ జేయాలని ఆదేశించామన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ పథకాల పనితీరుపై సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పట్ల అధికారులు ప్రత్యేక ఫోకస్ పెట్టి ఆశించిన ఫలితాలను సాధించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, పర్యవేక్షణ, అన్న క్యాంటీన్ల నిర్వహణ తీరు, పీతల హేచరీ నిర్మాణం, సముద్రపు నాచు తయారీపై ఎక్స్పోజర్ విజిట్, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాల పట్ల ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజాసంతృప్తి స్థాయిలను మెరుగుపరచాలని అన్నారు. ప్రభుత్వ పనితీరుకు కొలబద్ధంగా సంతృప్తి స్థాయిలను నిర్దేశించిందని ఆ దిశగా యంత్రాంగం పై స్థాయి నుంచి కింద స్థాయి వరకు పారదర్శకంగా పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు అభివృద్ధి సంక్షేమ ప్రక్రియలలో నాణ్యతకు పెద్దపీట వేస్తూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా లబ్ధిదారులకు అందించిన సేవలు పట్ల సంతృప్తి స్థాయిలను ప్రభుత్వం ఆరా తీస్తోందన్నారు. కావున ప్రతి అధికారి తమ తమ స్థాయిలో నాణ్యతా పరమైన పారా మీటర్లను అంచనా వేస్తూ అత్యంత పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు, రీ సర్వే అంశాలలో ఫిర్యాదులను పెండింగ్ ఆస్కారం లేకుండా పరిష్కరించాలన్నారు. సముద్రపు నాచు పైలెట్ ప్రాజెక్టులు నిర్వహణకై ముందస్తుగా డ్వాక్రా, మత్స్యకార మహిళలు 25 మందితో ఈనెల 26 నుంచి మూడు రోజులపాటు పరిశ్రమపై అవగాహన కొరకు ఎక్స్పోజర్ విజిట్ నిర్వహించినట్లు తెలిపారు. సచివాలయాలలో పనితీరు మెరుగుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, డిఆర్ఒ రాజకుమారి, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి శంకరరావు, జిల్లా మత్స్య శాఖాధికారి పివి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మే నెలలో విపరీతంగా కాస్తున్న ఎండలకు ప్రస్తుతం కురుస్తున్న అల్పపీడన వర్షాలు వేసవి తాపానికి చెక్ పెట్టాయి. వేసవిలో ఏర్పడుతున్న అల్పపీడనం తోడు నైరుతీ రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. గత వారంలో శుక్ర, శనివారం, ఆదివారం వరకు కాస్త తెరిపిచ్చినప్పటికీ సోమవారం ఉదయం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. 36 నుంచి 38 డిగ్రీలు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి 28 డిగ్రీలకు చేరుకున్నాయి. మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో చల్లబడిన వాతావరణంతో సామాన్యులు ముఖ్యంగా వృద్ధులు, పసిపిల్లలు సేద తీరారు. మరోవైపు భారీ వర్షాలతో దాళ్వా ధాన్యాన్ని ఎగుమతులు చేసుకునేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. పంట పొలాల నుంచి ధాన్యాన్ని బయటకు తీసుకువచ్చి వాహనాలపై ఎగుమతి చేయడం అకాల వర్షాలతో ఆటంకం ఏర్పడింది. ఇప్పటికే పంట పొలాల్లో సుమారు 50 శాతం ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉంది. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగుమతులకు అంతరాయం ఏర్పడడంతో పాటు ధాన్యం తడిసిపోయి రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి ఎగుమతులు కూడా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మొత్తం మీద భారీ వర్షాలతో మారిన వాతావరణం ప్రజలకు సేదతీరుస్తుండగా, రైతులకు పంట అమ్ముకునేందుకు వీలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

నిరంతరాయంగా ఓటర్ల నమోదు ప్రక్రియ

ప్రజాశక్తి - మండపేట

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ఎన్నికలతో సంబంధం లేకుండా నిరంతరాయంగా ఓటర్లనమోదు ప్రక్రియ కొన సాగుతుందని నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి పి.కృష్ణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నిర్వహణపై తగు సూచనలు, సలహాలను స్వీకరించి మినిట్స్‌ను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయడం జరుగుతుందని, ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ఎన్నికల దరఖాస్తులు ఫారం 6, 7, 8 యొక్క స్టేటస్ ఎన్నికల విభాగానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించడం జరురుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండపేట, కపిలేశ్వరం తహశీల్దార్లు పి.తేజేశ్వరరావు, పైడి చిన్నారావు, రాయవరం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఐ.సంధ్య, సహాయక వాటర్ నమోదు అధికారి పున్నం రాజ్ అవతార్ మెహర్‌బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, నాయకులు ఉంగరాల రాంబాబు, నాళం ఫణిప్రకాష్, పందిరి వీర్రాజు, సాధనాల చక్రపాణి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

మండలంలోని చినగాడవిల్లికి చెందిన జనసేన కార్యకర్త మాకే దుర్గాప్రసాద్ ఇటీవల మృతి చెందాడు. దుర్గాప్రసాద్ కుటుంబాన్ని సోమవారం జనసేన నాయకులు పరామర్శించారు. దుర్గాప్రసాద్ చిత్రపటానికి జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, ఆకుల సూర్యనారాయణ మూర్తి, చిక్కం సూర్యమోహన్ సూరిబాబు, నూకల రాజా, ఆర్‌డిఎస్.ప్రసాద్, భాస్కర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

ఐదు రోజుల యోగా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - అమలాపురం

అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో ఐదు రోజుల పాటు యోగ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్, ఇతర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ విధి విధానాలు, అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నెలరోజులపాటు యోగా కార్యక్రమాల నిర్వహణ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్, దీపం-2 సబ్సిడీ రాయితీలు చెల్లింపు అంశాలపై ప్రజా సంతృప్తి స్థాయిలు, జిల్లా కోర్టుల్లో మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిఎం అధ్యక్షతన రాష్ట్ర ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఏర్పాటు చేశారని, విధి విధానాలపై అధికారులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తూ, ప్రాజెక్టులు, పెట్టుబడుల సత్వర కార్యాచరణ కోసం ఏర్పాటు రూ.50 కోట్లు దాటిన ప్రాజెక్టులపై పర్యవేక్షణ వ్యవస్థ వేగంగా కార్యరూపం దాల్చేలా చూసేందుకు ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూపును నియమించిందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ లక్ష్యసాధనలో భాగంగా దీన్ని ఏర్పాటు చేసిందని, పలు జిల్లాలలో రూ.50 కోట్లు పెట్టుబడి దాటిన ప్రాజెక్టులపై ఈ గ్రూపు మానిటరింగ్ చేస్తుందన్నారు. ప్రాజెక్టుల్ని ఆచరణలోకి తేవడంలో ఎదురవుతున్న ఇబ్బందుల్ని పరిష్కరించి అడ్డంకులు తొలగించడం, అనుమతులు, క్లియరెన్సు వేగంగా వచ్చేలా చూడటం వంటి బాధ్యతల్ని నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో చేర్చుకుని ప్రయోజనాలు పొందాలన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలలో కోర్టులకు అనుబంధంగా మరుగు దొడ్ల నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో పదికాలాలు నిలిచే విధంగా ఆర్ అండ్ బి శాఖకు అప్పగించి, అందుకు అవసరమైన భూసేకరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఒ రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా ఈదల, సలాది

ప్రజాశక్తి - ఆలమూరు

సత్యనారాయణమూర్తి

నాగేశ్వరరావు

మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులుగా ఈదల సత్యనారాయణమూర్తి, సలాది నాగేశ్వరరావు నియమితులయ్యారు. సోమవారం ఎంఎల్ఎ బండారు సత్యానందరావు నియామకానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూ ఎంతో విధేయతతో పనిచేస్తున్న సీనియర్ నాయకులకు సముచిత స్థానం కల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా టిడిపి అధ్యక్ష కార్యదర్శులుగా ఈదల సత్యనారాయణమూర్తి, సలాది నాగేశ్వరరావు నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ మా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా చిత్తశుద్ధితో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త వంటిపల్లి పాపారావు, వట్టికూటి సతీష్, మెర్ల గోపాలస్వామి, నాగిరెడ్డి వెంకట రత్నం, దొండపాటి సుబ్బరాజు, ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్, రామానుజుల శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే..

ప్రజాశక్తి - రామచంద్రపురం

చెరువును తలిపిస్తున్న దేవస్థానం రోడ్డు

మండలంలోని కోటిపల్లి సోమేశ్వర స్వామి దేవస్థానం రోడ్డు చినుకు పడితే చెరువుగా మారుతుంది. ఈ పుణ్యక్షేత్రానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి యాత్రికులు రావడం జరుగుతోంది. కోటిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి దేవస్థానం వరకు వెళ్లే ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా మొత్తం రోడ్డంతా చెరువు లా మారుతుంది. గత పదేళ్ల గా ఈ రోడ్డు దుస్థితి ఇలానే ఉంది. ఈ రోడ్డు వెంబడి డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వచ్చిన వర్షం నీరు అంతా రోడ్డుపైనే నిలిచిపోతుంది. యాత్రికులు, గ్రామస్తులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే చెరువులో నుంచి నడిచి వెళుతున్నట్లుగా ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత దారుణంగా ఈ రోడ్డు పరిస్థితి తయారయింది. ఈ రోడ్డు నిర్మించాలని, ఆధునిక సిమెంట్ రోడ్డు వేయాలని గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లిన ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కోటిపల్లి దేవస్థానం రోడ్డును ఆధునీకరించాలని యాత్రికులు కోరుతున్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కోసం ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయన్నారు. రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పంటలు పండిస్తే ఆ పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. ఈ ధర్నాలో వల్లూరి రాజబాబు, టి.సురేష్, పి.సతీష్, రెడ్డి దుర్గాదేవి, కోట వీరబాబు, సుంకర శ్రీను, పి.శ్రీను, బాబూరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్

-వృధాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పైపులైన్ నుంచి వృధాగా పోతున్న తాగునీరు

మండలంలోని ర్యాలీ నుంచి పాటి చెరువుకు వెళ్లే కాలువ గట్టు రోడ్లోని తాగునీటి సరఫరా అయ్యే పైపులైన్‌కు పగుల్లు ఏర్పడ్డాయి. దీంతో గత నెల రోజులుగా పగిలిపోయిన పైపులైన్ నుంచి తాగునీరు వృధాగా పోతుంది. అయినా అధికారుల్లో ఏమాత్రం చలనం కన్పించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మండలంలోని బొబ్బర్లంక వద్ద రూ.13 కోట్లతో నిర్మించిన ఈ పథకానికి అడుగడుగున అవరోధం ఏర్పడుతుంది. పనులు చేసే సమయంలో గుత్తేదారు నాసిరకం పైపులు వేయడంతో తరచూ పైపులు పగిలి నీరు వధాగా పోతుండడంతో శుద్ధి చేసిన గోదావరి జలాలు మండలంలోని గ్రామాల ప్రజలకు అందని ద్రాక్ష గానే మిగిలింది. దీనికి తోడు పైపులైన్ గొట్టానికి పడిన రంధ్రం మట్టిలో ఉండటంతో తాగునీరు కలుషితం అవుతోంది. దీంతో కలుషితమైన నీటినే ప్రజలు తాగునీరుగా వినియోగిస్తున్నారు. కలుషితమైన తాగునీటితో రోగాల భారిన పడే ప్రమాదం లేకపోలేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

లింకు రోడ్లతో పల్లెలకు అనుసంధానం

ప్రజాశక్తి - ఆలమూరు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

పల్లెల మధ్య సునాయాస మార్గం కోసం లింకు రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం మండలంలోని గుమ్మిలేరు నుంచి పినపల్ల వెళ్లే వరాల కాలవ గట్టు రోడ్డు నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మార్గం సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర ఉంటుందన్నారు. దీని నిర్మాణం 18 అడుగుల వెడల్పుతో చేయడానికి ఉపాధి హామీ చట్టం నిధులు రూ.1.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ రహదారి నిర్మాణంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ మండల అభివృద్ధి శాఖలు సమన్వయంతో కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుణ్ణం రాంబాబు, సంగీత సుభాష్, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు వంక అన్నవరం, వట్టికూటి సతీష్, ఈదల శ్రీనివాస్ చౌదరి, ఆలమూరు డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్, ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, పంచాయతీరాజ్ ఎఇ వీరభద్రరావు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మత్స్యకార వృద్ధులకు పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలో వృద్ధులైన మత్స్యకారులు 278 మందికి నూతనంగా వృద్ధాప్య పింఛన్లు మంజూరయినట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంజూరైన పింఛన్లకు సంబంధించి దవపత్రాలను ఈ నెల 21న అందజేయనున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు కొత్తగా పింఛన్లు గూర్చి తాను పుదుచ్చేరి ప్రభుత్వ మత్స్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకువెళ్లి మంజూరు చేయించినట్లు తెలిపారు.

సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఆది ద్రావిడార్ అండ్ షెడ్యూల్డు ట్రైబ్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (పిఎడిఎస్టిడిసి) ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు సివిల్ సర్వీసెస్-2026 పరీక్షకు ఉచిత కోచింగ్‌కు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరికి చెందిన ఎస్‌సి, ఎస్‌టిలై ఉండాలని, 35 ఏళ్లకు మించకుండా, ఎస్ఎస్‌సి ఉన్నతవిద్యను పుదుచ్చేరిలో అభ్యసించిన వారై ఉండాలని సూచించారు. అభ్యర్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించి అందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఉచిత కోచింగ్‌కు ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తులను 'పివై.జిఒవి.ఇన్' వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకొని పూర్తి చేసి యానాం పాడ్కో ఆఫీసులో అందజేయాలని కోరారు.

వైసిపి కార్యకర్తలందరికీ సముచిత స్థానం

ప్రజాశక్తి-పిఠాపురం

వైసిపిలో కష్టపడి పని చేస్తున్న ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వంగా గీత అన్నారు. నియోజకవర్గంలో అన్ని అనుబంధ విభాగ కమిటీల్లో పార్టీ కోసం కష్ట పడ్డ కార్యకర్తలకు పెద్దపీట వేసినట్టు తెలిపారు. పార్టీ ఎప్పుడూ ప్రజలకు చేరువగా ఉండే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని, కార్యకర్తలకు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైసిపి కార్యకర్తలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు.

నేడు రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

తలసేమియా చిన్నారుల కోసం రక్త దాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయనున్నట్లు తహశీల్దారు జి.చిన్నారావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు సురక్ష ప్యాలెస్‌లో నిర్వహించే రక్తదాన శిబిరానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఇతర దాతలు పాల్గొని రక్తదానం చేయాల్సిందిగా కోరారు. రక్తదానం చేసేవారు ముందుగా తహశీల్దారు 9154247464, ఎంపిడిఒ 9441013090 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు.

మాదిగ కార్పొరేషన్ ద్వారా లబ్ధి

ప్రజాశక్తి - సామర్లకోట

మాదిగ కార్పొరేషన్ ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానని కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా అన్నారు. సోమవారం సామర్లకోటలో మాదిగ ఆత్మగౌరవ రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వల్లూరి నాని మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజా మాట్లాడుతూ తనకు ఈ పదవిని ఇచ్చేందుకు కృషి చేసిన కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాజా కృతజ్ఞతలు తెలిపారు.

టి.సి.పోయినది

తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు మండలం, తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన **మల్లిపూడి సుశీల, తండ్రి: దుర్గారావు** ఇంటర్మీడియట్ టి.సి.పోయినది. దొరికినవారు ఇచ్చినచో తగిన బహుమతి ఇవ్వబడును. సెల్: 77022 74929

కైకరవు సత్యనారాయణ
అడ్వకేట్, సుబ్బరాజుపేట,
నిడదవోలు, సెల్:98481 75289

డాక్యుమెంట్లు పడిపోయినవి

తూర్పుగోదావరి జిల్లా, గోకవరం మండలం, గోకవరం గ్రామానికి చెందిన అట్లా వెంకటలక్ష్మి W/o. అట్లా వెంకటేశ్వరరావు (వెంకటరావు), S/o. గోవిందు, 3-48 వాసుదేవా వీధి, గోకవరం గ్రామం, మండలం. మా ఇంటి దగ్గర నుండి గోకవరం సెంటర్‌కి జిరాక్స్ నిమిత్తం వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయాయి. డాక్యుమెంట్ నెంబర్ 917/1987 పడిపోయినవి. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబరు తెలుపగలరు.

ఫోన్: 846504 0746

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, వేట్లపాలెం, హరిజనపేట, గూడపర్తి గ్రామము, డోర్ నెం. 21-97 నివాసి అయిన ఏలేటి దుర్గా భవాని అను నేను వేట్లపాలెం నుండి సామర్లకోట వస్తుండగా రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ది. 09-05-2025వ తేదీన మార్గ మధ్యలో నా పాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెంబర్ **డబ్ల్యు 2907400.** కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరని కోరుచున్నాను.

ఏలేటి దుర్గా భవాని
W/o. వీరబాబు, డోర్ నెం. 21-97,
హరిజనపేట, గూడపర్తి
వేట్లపాలెం - 533434, సామర్లకోట మండలం
కాకినాడ జిల్లా, సెల్: 8790797623

దస్తావేజులు పోయినవి

తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, అనపర్తి గ్రామం, డోర్ నెం. 8-14 రు కాపురస్తులు కర్రి వెంకట కృష్ణారెడ్డి (లేటు) గారి భార్య కర్రి మణి అనే మహాలక్ష్మి అనువారికి రౌతులపూడి మండలం, ఎస్.అగ్రహారం పంచాయితీలో చేరిన బిళ్లవాక రెవెన్యూ గ్రామం తాలూకు సర్వే నెంబర్లు 59, 60-2, 64-1 మరియు 80 కి సంబంధించిన 15-65 1/2ట్లు సంబంధించిన దస్తావేజు నెంబర్లు 3470, 3471/ 3-12-2016 గా గల దఖలు దస్తావేజులు మరియు 39/23-7-2018 వీలునామా మరియు 3184/26-12-2001, 204/26-9-2001 క్రయ దస్తావేజులు తుని సబ్‌రిజిస్ట్రార్ వారి ఆఫీసు వద్ద పోయినవి. ఈ దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు.

కర్రి మణి అనే మహాలక్ష్మి
W/o. లేటు వెంకట కృష్ణారెడ్డి
అనపర్తి గ్రామం అనపర్తి మండలం
తూ॥గో॥జిల్లా, సెల్: 9849914685